ధాన్యం కొనుగోలులో తరుగు నష్టం



హుస్నాబాద్‌లో మిల్లు ముందు విక్రయానికి తెచ్చిన ధాన్యం

న్యూస్‌టుడే, హుస్నాబాద్: వాతావరణ ప్రతికూల పరిస్థితులు, రైతుల అవసరాలను ఆసరా చేసుకున్న వ్యాపారులు, మిల్లర్లు కొందరు ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడుతున్నారు. హుస్నాబాద్ పట్టణంలో గత కొద్ది రోజులుగా ప్రైవేటు వ్యాపారుల ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. సంచి, తరుగు, హమాలీ పేరిట తమకు నచ్చిన విధంగా కొనుగోళ్లలో కోతలు పెడుతున్నారని రైతులు చెబుతున్నారు. కొనుగోళ్ల కొరకు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. రైతులు మాత్రం ప్రైవేటుకు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. వరి చేలలో యంత్రంతో కోత పూర్తికాగానే ట్రాక్టర్లలో నేరుగా మిల్లరు, వ్యాపారుల వద్దకు ధాన్యం తరలించి విక్రయిస్తున్నారు. డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో 68,240 ఎకరాల్లో వరి సాగు చేశారు. కోతలు ప్రారంభంగా మరోవైపు కొనుగోలు కేంద్రాలు ఇపుడిపుడే ప్రారంభమవుతున్నాయి. ప్రారంభించిన కేంద్రాల్లో తూకాలు చేపట్టాల్సి ఉంది. కొంత సమయం పట్టే అవకాశం ఉంది. వానలు కురిసి కోసిన పంట దెబ్బతింటుందనే ఉద్దేశంతో ప్రైవేటుకు అమ్ముతున్నారు. ఆరబెట్టకుండా పచ్చి ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1900 నుంచి 1950 వరకు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. తూకాల్లో సంచులు లేకపోయినా క్వింటాలుకు సంచుల పేరిట మూడు కిలోలు తరుగు తీస్తున్నారు. హమాలీ లేకపోయినా క్వింటాలుకు రూ.30 కోత పెడుతున్నారు. అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు కామన్‌కు రూ2300, ఏ గ్రేడ్‌కు రూ.2320 నిర్ణయించింది. మద్దతు ధరకు తక్కువైనా రైతులు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్లలో జాప్యం, నిబంధనల ఇబ్బందులు పడటం కన్నా పచ్చి ధాన్యాన్ని అమ్ముతున్నామని రైతు శంకర్‌రెడ్డి తెలిపారు.

ఉపకార వేతనాల విధానంలో మార్పులు

సిద్దిపేట టౌన్: ఎస్సీ విద్యార్థుల పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల నమోదుకు సంబంధించి విధివిధానాల్లో కేంద్ర ప్రభుత్వం 2024-25కు మార్పులు చేసినట్లు జిల్లా బీసీ, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి కవిత తెలిపారు. ఇందుకోసం జిల్లాలో అర్హులైన ఎస్సీ విద్యార్థి పదో తరగతి మెమోలో ఉన్న విధంగానే ఆధార్‌కార్డులో కూడా ఉండాలన్నారు. ఆదాయ పరిమితి రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచారన్నారు.

విదేశీ విద్యానిధి దరఖాస్తుల గడువు పొడిగింపు

అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకానికి సంబంధించి దరఖాస్తుల గడువు 29వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా బీసీ, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిణి తెలిపారు. ఏదైనా నాలుగు సంవత్సరాల డిగ్రీ చదివిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. అమెరికా, కెనెడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌతకొరియా లాంటి విదేశాల్లో చదివే అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అందించే ఈ ఆర్థికసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీలలో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో పోటీలు జరుగనున్నాయి. ఎంపికైన వారిలో అండర్-16 బాలికల విభాగంలో రిజ్వానా, అంకిత, అండర్-14 విభాగంలో ఎం.లిఖిత, సాయిప్రసన్న, అండర్-18 విభాగంలో కొయ్యడ హర్షిత ఎంపికయ్యారు. బాలురలో అండర్-14 విభాగంలో పవన్‌రెడ్డి, జి.చరణ్, అండర్-16లో జి.సర్వేశ్, బి.నిఖిల్, స్టాండ్‌బైగా రవళి ఎంపికయ్యారు. వీరితో పాటు సైక్లింగ్ అకాడమీకి చెందిన సూరంపల్లి సుమిత్, అమిత్, భల్లు నిఖిల్, వరుణ్‌రెడ్డి, రాకేశ్, జస్వంత్ ఎంపికయ్యారు.

రోడ్డు భద్రతా కమిటీలు ఏర్పాటు చేస్తాం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారి, ఇతర రహదారులపై రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా కమిటీలు ఏర్పాటు చేస్తామని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ అన్నారు. మానవ తప్పిదాల వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఎట్టిపరిస్థితుల్లో కూడా మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఓవర్‌టేక్ చేయబోయి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దని సూచించారు. రాజీవ్‌రహదారిపై దుద్దెడ టోల్‌గేట్ నుంచి బెజ్జంకి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవక్కపల్లి వరకు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను (బ్లాక్ స్పాట్) లను సీఐ ప్రవీణ్‌కుమార్, హెచ్‌కేఆర్ డీజీఎం విజయ్‌భాస్కర్‌తో కలసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.


చలికాలం.. వసతి అగమ్యగోచరం

వసతిగృహాలు	65
గురుకులాలు	40
విద్యార్థులు	25,400



నంగునూరు: పాలమాకుల ఎస్సీ హాస్టల్‌లో పగిలిన కిటికీ అద్దాలు

న్యూస్‌టుడే, సిద్దిపేట, దుబ్బాక, నంగునూరు, కొండపాక గ్రామీణం, దౌల్తాబాద్, గజ్వేల్ గ్రామీణం: ఇళ్లలో ఉండే పిల్లలకు తల్లిదండ్రులు.. చలికాలం రాగానే దుప్పట్లు, మంచాలు, వేడినీరు, స్వెటర్లు తదితరాలతో బాలలకు అసౌకర్యం కలగకుండా, అనారోగ్యం బారిన పడకుండా శ్రద్ధ తీసుకుంటారు. వసతి గృహాలు, గురుకులాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు మాత్రం అరకొర వసతులతో చలికాలం వస్తోందంటేనే వామ్మో భరించేదెలా.. అని ఆందోళన చెందే పరిస్థితి నెలకొంది. వేడినీటి సౌకర్యం హాస్టళ్లలో ఉండటం లేదు. పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. పట్టించుకునేవారు లేరు. చలికాలానికి ముందస్తుగానే మరమ్మతులు చేస సౌకర్యం కల్పించాల్సి ఉంది. కొన్ని గురుకులాలు, హాస్టళ్లలో కిటికీలు లేవు. అద్దాలు పగిలిపోయాయి. తలుపులు లేని గదులు కూడా ఉన్నాయి. వాటిలో బాలలు ఎలా ఉండగలుగుతారు? దోమలతో, చలి గాలితో అవస్థలు ఎదుర్కోనున్నారు. వసతి, మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోంది.



దుబ్బాక కస్తూర్బా పాఠశాల గదిలో తలుపులు లేని కిటికీ



దుబ్బాక మైనారిటీ గురుకులం కిటికీకి చిరిగిన జాలీ



గజ్వేల్ బాలుర పోస్టుమెట్రిక్ వసతిగృహంలో..





దౌల్తాబాద్: జ్యోతిబాపులే గురుకులంలో తలుపులు లేని గది

- దుబ్బాక పట్టణంలో కస్తూర్బా బాలికల పాఠశాల వసతి గృహంలో స్లాబ్ నుంచి నీరు గదుల్లోకి కారుతోంది. సౌర గీజర్ పని చేయడం లేదు.
- దుద్దెడలో పాఠాలు వినే గది, రాత్రి నిద్రపోయే గది ఒకటే. కిటికీలకు అద్దాలు లేవు.
- హబ్సీపూర్ మహాత్మా జ్యోతిబా పులే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో గదులు, దుప్పట్ల కొరత ఉంది. వేడినీరు అందుబాటులో లేదు.
- దుద్దెడ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులు స్నానాలు చేయగా వ్యర్థ జలాలు బయటకు వెళ్లే ఏర్పాటు లేదు.
- పాలమాకుల వార్డెన్ గణేశ్ రెండేళ్లుగా సొంతంగా ఖర్చు చేసి కర్రలు తెప్పించి వేడి నీటిని అందిస్తున్నారు.
- గజ్వేల్‌లోని విద్యా సౌధం భవనాల బాలుర సముదాయంలో కిటికీలు లేవు. వేడి నీటి పరికరాలు ఏర్పాటు చేయలేదు. పరికరానికి మరమ్మతులుచేయాలి.
- గుర్రాలగొంది, చిన్నకోడూరులో చన్నీటి స్నానాలే దిక్కవుతున్నాయి. సిద్దిపేట మైనార్టీ గురుకులంలో కిటికీలకు తలుపులు లేవు.
- బెజ్జంకిలోని ఎస్సీ, బీసీ హాస్టల్లో దోమలు రాకుండా కిటికీల జాలీలు చిరిగాయి.



కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వాల్మీకి బోయ సంఘం ప్రతినిధులు

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శం



కమిషనరేట్‌లో... సీపీ అనూరాధ, అదనపు డీసీపీ మల్లారెడ్డి, సిబ్బంది

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఆదికవి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందరికీ ఆదర్శమని పోలీసు కమిషనర్ అనూరాధ అన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి బోయవాడిగా జీవితం గడిపి అద్భుతమైన రామాయణ గ్రంథాన్ని రచించిన మహా కవి అన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు డీసీపీ మల్లారెడ్డి, ఏవో యాదమ్మ, అధికారులు పాల్గొన్నారు. బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు. బీసీ అభివృద్ధి శాఖ అధికారి షేక్ అహ్మద్, వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయ రాములు, ఏవో అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

త్వరలో రూ.2 లక్షలకు పైగా రైతు రుణాల మాఫీ: మంత్రి



గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కేడం లింగమూర్తి, చిత్రంలో పొన్నం ప్రభాకర్, నాయకులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ రుణభారంతో బాధపడకూడదన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులకు సైతం రుణమాఫీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు నమ్మొద్దన్నారు. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి గురువారం బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మంత్రి మాట్లాడారు. తాము అధికారంలోకి రాగానే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేశామన్నారు. హామీలను నెరవేరుస్తున్నామన్నారు. విద్యాబోధనకు సంబంధించి ఇప్పటికే డీఎస్సీ, ఉపాధ్యాయ పదోన్నతులు పూర్తి చేశామని, అమ్మ ఆదర్శ బడుల కార్యక్రమం కింద 28 వేల పాఠశాలలకు రూ.1100 కోట్లు చెల్లించామన్నారు. గురుకులాలు, వసతిగృహాలకు సంబంధించి అద్దె బకాయిలు ఇప్పటికే రూ.100 కోట్లు చెల్లించామన్నారు. విద్యాసంస్థలు మూసేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రాబోయే రోజుల్లో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయిస్తామన్నారు. విపంచి కళా నిలయంలో కేడం లింగమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. కోహెడ మండలాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామన్న హామీ ఏమైందని కొందరు విమర్శిస్తున్నారని, ప్రజల ఆకాంక్షల మేరకు ఆ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అన్ని మండలాలకు సంబంధించి నిరుద్యోగుల జాబితా తయారు చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తామని లింగమూర్తి మాట్లాడుతూ చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, అత్తూ ఇమామ్, పాల్గొన్నారు. జీవో నెం.317 బాధితులు ప్రదర్శన చేయగా వారిని మంత్రి వేదిక మీదికి పిలిపించుకుని మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

గజ్వేల్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు



పట్టణంలో రోడ్డుపై వరకు నిలిపిన వాహనాలు

న్యూస్‌టుడే, గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటం లేదు. కొనుగోలుదారులను ఆకర్షించేందుకు వ్యాపారులు రోడ్లపై సామగ్రి పెడుతున్నారు. రహదారులు ఇరుగ్గా మారుతున్నాయి. పట్టణంలో ఇరుకు రోడ్లను విస్తరించినా కష్టాలు తప్పటం లేదు. కొనుగోలు దారులు వాహనాలపై వస్తూ రోడ్ల పక్కనే నిలుపుతుండటంతో రద్దీ సమస్య ఏర్పడుతోంది. నిలువరించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రద్దీ సమస్యతో బాటసారులు తీవ్ర నిరుత్సాహానికి గురువుతున్నారు. వారాంతపు సంత రోజున అవస్థలు మరిన్ని పెరుగుతున్నాయి. ఆటోలు, కార్లు, ద్విచక్రవాహణాలు నిలిపే స్థలమే లేకపోవటంతో కొనుగోలు దారులు ఆయా దుకాణాల ముందు పెడుతున్నారు. వ్యాపారం సాగడానికి రోడ్ల పైనే కొందరు దుకాణదారులు సామగ్రి పెడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే అధికారులు పట్టించుకుంటున్నారు. తర్వాత షరామామూలు అవుతోంది. బల్దియాలో 50వేల జనాభా ఉంది. విద్యాలయాలు, ఆసుపత్రులు, వాణిజ్యసముదాయాలు, ప్రజావసరాలు పెరిగిన సందర్భంతోపాటు రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశమున్నందున పట్టణంలోని రోడ్లు పెద్ద రహదారులను అనుసంధానంగా విస్తరిస్తున్నారు. రూ.25 కోట్ల వ్యయంతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రోడ్డు విస్తరణ పూర్తయినప్పటికీ రద్దీ కొనసాగుతోంది.

రింగురోడ్డు పూర్తికాక..

మున్సిపాలిటీలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం గత ప్రభుత్వం చేపట్టిన రింగురోడ్డు పూర్తికాకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదు. మొత్తం 23 కిలోమీటర్లలో రైల్వే వంతెన వద్ద మిగిలిన 1.6 కిలోమీటర్లు, శ్రీగిరిపల్లి నుంచి వయా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, సంగాపూర్ మీదుగా తూప్రాన్ రోడ్డును కలిసి ఒక వైపు రోడ్డులో సంగాపూర్ వద్ద కేవలం 60 మీటర్లు మాత్రమే మిగిలిపోయింది. ఈ మూరెడు రోడ్డును పూర్తి చేస్తే నల్గొండ ఉమ్మడి జిల్లా నుంచి జాతీయ రహదారి తూప్రాన్ మీదుగా వెళ్లే భారీ వాహనాలు గజ్వేల్ పట్టణంలోకి రాకుండానే బైపాస్ వెళ్లనున్నాయి. ట్రాఫిక్ సమస్య తీరనుంది.

సమస్యలు ఇక్కడ.. ● తూప్రాన్ రోడ్డులో రేకులు, ఇంటి నిర్మాణ ఉపకరణాలు రోడ్ల పైనే పెడుతున్నారు. ● వెల్డింగ్ దుకాణాల పనులు దారిపైనే చేస్తున్నారు. ● పాత వాహనాలు అమ్మేవారూ ట్రాఫిక్‌కు అడ్డంగా పెడుతున్నారు. ● బ్యాంకులు, వైన్సుల వద్ద వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా మారింది.



పొంచి ఉన్న ప్రమాదం

సిద్దిపేట, అర్బన్ న్యూస్‌టుడే: సిద్దిపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద దిమ్మెలకు పగుళ్లు వచ్చి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఒకటి పూర్తిగా విరిగిపడిపోయింది. మరొకటి పగుళ్లు ఇచ్చింది. అక్కడికి కొత్తగా వచ్చేవారికి ప్రమాదకర దిమ్మె విషయం తెలియక నిలబడుతున్నారు. ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శనగ రైతులకు రూ.3.3 కోట్ల లబ్ధి



న్యూస్‌టుడే, గజ్వేల్: శనగలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను పెంచటంతో జిల్లాలో ఈ పంట సాగు చేస్తున్న పాతిక వేల మంది రైతులకు రూ.3.30 కోట్ల మేర లబ్ధి కలగనుంది. పప్పుదినుసుల సాగులో భాగంగా జిల్లాలో ప్రతి ఏటా యాసంగిలో సుమారు 20 వేల ఎకరాల్లో వేస్తుంటారు. 40 కిలోల విత్తనాలు, రెండు బస్తాల ఎరువులు, ఐదు లీటర్ల పురుగు మందులతోపాటు దున్నకం, నూర్పిడి ఖర్చుతో కలిసి ఎకరా సాగుకు రూ.15 వేల వరకు ఖర్చు చేస్తుంటారు. పంట ఆశాజనకంగా సాగితే సరాసరి ఎకరాకు 8 క్వింటాళ్ల శనగల దిగుబడి వస్తాయని అధికారులు చెబుతున్నారు. గత సంవత్సరం క్వింటాలుకు రూ.5440 మద్దతు ధర ఉండగా కేంద్రం ఈ సంవత్సరానికి క్వింటాలుకు రూ.210 పెంచింది. మద్దతు ధర రూ.5650కి చేరింది. 1.60 లక్షల క్వింటాళ్ల దిగుబడి రానుంది. నల్లరేగడి భూములున్న గజ్వేల్, జగదేవపూర్, చేర్యాల, కొండపాక, మిరుదొడ్డి, వర్గల్, కుకునూర్‌పల్లి తదితర మండలాల్లో ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఏటా ఆరు చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

వాన తడుపు.. రైతు జడుపు



సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ వద్ద గురువారం కురిసిన వానకు తడిసిన మక్కలు, వడ్ల కుప్పలు



సిద్దిపేట: ధాన్యం చూపుతున్న రైతులు

- న్యూస్‌టుడే, సిద్దిపేట

ఉత్సాహంగా కళా ఉత్సవం



నృత్య పోటీల్లో విద్యార్థినులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలో జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళా ఉత్సవం గురువారం సంబురంగా జరిగింది. పట్టణంలోని టీటీసీ భవన్ వేదికగా నిర్వహించిన పోటీల్లో తొమ్మిదో తరగతి మొదలు ఇంటర్ చదివే విద్యార్థులు పాల్గొన్నారు. దాదాపు 60 విద్యా సంస్థల నుంచి 220 మంది హాజరయ్యారు. దృశ్య కళ, గాత్ర సంగీతం, వాద్య సంగీతం, నృత్యం, నాటకం, కథా విభాగాల్లో పోటీలు నిర్వహించామని అకాడమిక్ మానిటరింగ్ అధికారి బేతి భాస్కర్ తెలిపారు. ఎంపికైన వారు: గాత్ర సంగీతం - టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బృందం (గజ్వేల్), వాద్య సంగీతం - యశ్వంత్ (దుబ్బాక ఆదర్శ పాఠశాల), నృత్యం - టీఆర్ఈఐఎస్ బృందం (ఎన్సాన్‌పల్లి), నాటకం - చామంతి (లచ్చపేట ఆదర్శ), దృశ్య కళ - క్రాంతికుమార్ (లచ్చపేట ఆదర్శ), కథ - హరిణి (సిద్దిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల).

మోసపోయిన ప్రజాప్రతినిధి

ఉద్యోగాలని సైబర్ నేరస్థుడు చెప్పడంతో నిరుద్యోగులతో డబ్బులు కట్టించిన వైనం

గజ్వేల్, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థలో ఉద్యోగా వస్తాయని చెప్పిన సైబర్ నేరగాడి మాటలు నమ్మిన గజ్వేల్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి స్థానిక నిరుద్యోగులతో డబ్బులు కట్టించాడు. తీరా డబ్బు కట్టిన తర్వాత ఆరా తీయగా మోసమని తేలింది. బుధవారం సాయంత్రం అజ్ఞాత వ్యక్తి గజ్వేల్‌కు చెందిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధి ఫోన్ చేసి విద్యుత్తు సంస్థలో ఉద్యోగాలకు దరఖాస్తులు చేయించుమని చెప్పాడు. ఆయన తన సోదరుడైన మున్సిపల్ ప్రజాప్రతినిధికి చెప్పటంతో సుమారు 20 మంది నిరుద్యోగ యువకులకు సమాచారమిచ్చారు. ఆ యువకులు సైబర్ నేరగాడి ఫోన్‌కు రెండు దఫాలుగా రూ.2 వేల చొప్పున యూపీఐ ద్వారా పంపిచారు. అనంతరం విద్యుత్తు అధికారికి ప్రజాప్రతినిధి ఫోన్ చేసి వివరాలు అడగడంతో అలాంటి నియామకాలేవి లేవని వెల్లడైంది. ఫోన్ చేస్తే అజ్ఞాత వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయిన వారంతా పోలీసులను గురువారం ఆశ్రయించారు. పోలీసులు పూర్తి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు.

ఖాతాల్లోకి ఉపాధి డబ్బులు

తుది దశకు అనుసంధాన ప్రక్రియ



న్యూస్‌టుడే గజ్వేల్ గ్రామీణ: ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే కూలి డబ్బులు చెల్లిస్తామని కేంద్రం రెండేళ్ల క్రితమే ప్రకటించింది. ఇందుకు జాబ్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయాల్సిందిగా పేర్కొంది. ఈ ప్రక్రియ దాదాపుగా పూర్తికావొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 1.98 లక్షల జాబ్ కార్డులు, 3.98 లక్షల మంది కూలీలు ఉండగా అందులో క్రియాశీలకంగా 2,24,532 ఉన్నారు. ఇప్పటి వరకు 2,21,540 మంది ఆధార్ అనుసంధానం పూర్తి చేయడంతో కూలి డబ్బులు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి వస్తున్నాయి.

ఇదివరకు కూలి డబ్బులను స్థానిక తపాలా కేంద్రాల నుంచి పంపిణీ చేస్తూ వచ్చారు. వేలిముద్రలు తీసుకొని నగదు ఇచ్చేవారు. అయితు జిల్లాలో కొన్నిచోట్ల కూలీలకు తెలియకుండానే డబ్బులు మాయం చేసిన ఘటనలు వెలుగుచూశాయి. వేలిముద్ర వేయగానే నగదు ఉపసంహరించుకొని.. డబ్బులు రాలేదని చెప్పిన వ్యక్తులు కూడా ఉన్నారు. ఇలా జిల్లాలో అక్రమాలకు పాల్పడిన పలువురిపై కేసులు నమోదయ్యాయి. మరి కొన్ని చోట్ల చిల్లర డబ్బులు లేవని పై మొత్తం దోచుకునేవారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయడానికి బ్యాంకు ఖాతా విధానం ఎంతగానో ఉపకరిస్తుంది. కూలీలను మోసం చేసే అవకాశం ఉండదు.

బారులు తీరడం ఉండదిక..

గతంలో డబ్బులు రాగానే తపాలా కార్యాలయాల ఎదుట కూలీలు బారులు తీరేవారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వరసలో నిలబడితే గాని తీసుకోలేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లింపుల విధానాన్ని అమలు చేయడంతో నగదు ఉపసంహరణ సులువైంది. డబ్బులు ఖాతాల్లో పడితే సంక్షిప్త సమాచారం వస్తుంది.

పారదర్శకంగా పనులు

– జయదేవ్ ఆర్య, డీఆర్డీవో, సిద్దిపేట

ఉపాధి పనుల్లో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నూతన సాంకేతికతను అమలు చేస్తుంది. తద్వారా పారదర్శకంగా పనులు జరుగుతున్నాయి. కూలీల డబ్బులు నేరుగా వారి ఖాతాలోనే జమవుతున్నాయి. అరచేతిలోనే ఉపాధి హామీ సమాచారం తెలుసుకునేందుకు కేంద్రం నూతనంగా జన మన్ నరేగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

అవసరం మేరకే నరికివేత



చేర్యాలలో జాతీయ రహదారి పక్కన సగమే నరికిన చెట్టు

న్యూస్‌టుడే, చేర్యాల: ఈ చిత్రాల్లోని చెట్లు చూశారా.. అవి దాదాపు మూడు దశాబ్దాల క్రితం నాటిన మొక్కలు పెద్ద వృక్షాలుగా మారాయి. దుద్దెడ క్రాస్ రోడ్డు నుంచి జనగామ వరకు గతంలో సుమారు 500లకు పైగా భారీ వృక్షాలుండేవి. జాతీయ రహదారిగా మార్పు చెందగా, కేంద్ర ప్రభుత్వం విస్తరణకు నిధులు మంజూరు చేసింది. రెండేళ్ల క్రితం విస్తరణ పనులు ప్రారంభించారు. 342 వృక్షాలను తొలగించాలని నిర్ణయించారు. అధికారుల ఆలోచన, గుత్తేదారు నైపుణ్యంతో కొన్నింటిని సజీవంగా ఉంచారిలా. ఎన్ని డబ్బులు ఖర్చు చేసినా ఆ స్థాయి వృక్షాలను సృష్టించలేము. అందుకే కొంత మేరకైనా ఆ లోటును తీర్చాలనుకున్నారు. రహదారికి పక్కనున్న కొన్ని వృక్షాల కొమ్మలను అవసరం మేరకే నరికేశారు. 50కి పైగా వృక్షాలు సజీవంగానే ఉన్నాయి. వృక్షాలను పూర్తిగా తొలగించాలనే అనుమతులు ఉన్నా కాపాడటాన్ని ప్రజలు అభినందిస్తున్నారు.

ప్రయాణికులకు ఆహ్లాదకరం




కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట ఊర చెరువు మధ్యలోంచి రైల్వే పట్టాలు ఉన్నాయి. ఇక్కడ చెరువు రెండు భాగాలుగా విడిపోయింది. రైలు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ప్రయాణికులకు కొంగొత్తగా కనిపిస్తుంది. చుట్టూరా నీరు, సుదూరంలో పచ్చని పొలాలు ఆకట్టుకుంటున్నాయి.

గురుతర బాధ్యతతో అడుగెయ్

పాఠశాల రూపురేఖలను మార్చాలంటే కృతనిశ్చయం అవసరం. తోటివారితో పాటు పిల్లలు, తల్లిదండ్రుల మనసు గెలవాలి. సంకల్పం నెరవేరే వరకు విశ్రమించొద్దు.

ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు ప్రత్యక్ష మార్గదర్శి. క్రమశిక్షణ, అంకిత భావం, సేవా కోణం, చైతన్య కెరటం.. ఇలా భిన్న పాత్రల సమాహారమే గురువు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో తాజాగా వందలాది మంది ఉపాధ్యాయ కొలువులు చేపట్టారు. వీరంతా తమ ప్రత్యేకతను చాటాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఇందులో సాగుతున్న ఎంతో మంది మార్గదర్శకంగా నిలిచారు. తమదైన శైలి.. సృజనాత్మక బోధనతో విద్యార్థులతో మా మంచి మాస్టారు అని కీర్తినొందుతున్నారు. ఇలాంటి ఆదర్శప్రాయులను నవతరం బోధకులు అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

- న్యూస్‌టుడే, సిద్దిపేట



జాతీయ పురస్కారం గెలిచి..



సిద్దిపేటకు చెందిన రామస్వామి 2015 నుంచి 2022 వరకు ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేశారు. బడిని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో గురుతర పాత్ర పోషించారు. బాధ్యత చేపట్టిన ఏడాదిలోనే మార్పు తీసుకొచ్చారు. విద్యార్థులు 300 మంది నుంచి వేయి సంఖ్య దాటేందుకు సమష్టిగా కృషి చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. సాంకేతిక వినియోగంలో స్ఫూర్తి చాటారు. 2022లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ప్రస్తుతం సిద్దిపేట డీఈవో కార్యాలయంలో ప్రణాళిక విభాగం సమన్వయకర్తగా కొనసాగుతున్నారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట

బడిని బతికించి..



ఎంతోమందిలో విద్యా వెలుగులు నింపేది పాఠశాలే. దీని సంరక్షణ అందరి బాధ్యత. బడి మాది అనుకుంటే పిల్లలెంతో మంది బాగుపడట్లే.

మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ పాఠశాలలో 2015లో విద్యార్థుల సంఖ్య కేవలం 8 మందే. స్థానిక పిల్లలంతా ప్రైవేటుకు వెళ్తున్నారు. ఈ తరుణంలో హెచ్‌ఎంగా ఓంకార్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులుగా నుస్రత్, రామకృష్ణారెడ్డి బదిలీపై వచ్చారు. బడిని బతికించుకోవాలని కంకణం కట్టుకున్నారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారిని ఒప్పించి పిల్లలను ప్రైవేటుకు పంపించవమని తీర్మానం చేయించారు. వారికి స్థానికులు అండగా నిలిచారు. ప్రస్తుతం 207 మంది ఉన్నారు. ఇప్పటికీ ఆ ఉపాధ్యాయులు చైతన్యంతో బడి వెలిగిపోతోంది. పలు పురస్కారాలూ దక్కాయి. – న్యూస్‌టుడే, ములుగు

వారితో మమేకమై..

విద్యార్థుల మనసు గెలవడం కాసింత కష్టమే. అలాంటి వారు ఎక్కడో ఓ చోట కనిపిస్తారు. ఒక్కసారి పిల్లలను ఆకట్టుకుంటే గుండెల్లో పెట్టుకొని పూజిస్తారు.



కొడంగల్ పరిధి పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాలలో పని చేసిన క్రాంతికుమార్.. విద్యార్థులతో మమేకమై బోధించారు. పిల్లలకు అన్నిరకాలుగా అండగా నిలిచారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పేదలకు సాయం అందించారు. నవోదయ, గురుకుల వంటి పరీక్షల్లో విజయానికి కృషి చేశారు. తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకత చెప్పి బడికి పంపించేలా చేశారు. విధుల్లో చేరిన సమయంలో 27 మంది ఉండగా. . ఆ తర్వాత 64కు చేరింది. ఇటీవల హుసేన్‌పూర్‌కు బదిలీ కాగా, ఆ సమయంలో విద్యార్థులు, గ్రామస్థులు కంటతడి పెట్టుకున్నారు.

– న్యూస్‌టుడే, కొడంగల్



ఆకట్టుకునేలా బోధించడం ఉపాధ్యాయుడి కర్తవ్యం. ఇందుకు ఎంతో కృషి అవసరం. వారి సర్వతోముఖాభివృద్ధికి చొరవ చూపాలి.

సాధారణంగా సెలవు దొరికితే ఎవరైనా సరదాగా గడుపుదాం అనుకుంటారు. రామాయంపేట ఉన్నత పాఠశాలలో ఆంగ్లం బోధించే రమేశ్ మాత్రం అలా కాదు. మండలంలోని కాట్రియాల ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకులు లేకపోవడంతో ఈయనే

పిల్లలు నష్టపోవద్దని..

చొరవ చూపి అక్కడికెళ్లి పాఠాలు చెబుతూ వచ్చారు. సెలవు రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠ్యాంశాలు బోధించారు. మరోవైపు ఇతర పిల్లలకు సైతం ఇంగ్లిషు నేర్పించడం విశేషం.

- న్యూస్‌టుడే, రామాయంపేట

సమాజ పరిస్థితిని మార్చడంలోనూ ఉపాధ్యాయుడిది కీలకపాత్ర. ఈ మార్గంలో నడిస్తే ఎంతో మంది బాగుపడటం ఖాయం.

మానవత్వం చాటుతూ..



మతిస్థిమితం లేని బాలికను చేరదీసి..

గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన జంగం సౌజన్య మెదక్ జిల్లా కొడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నారు. ఈమె సామాజిక సేవలోనూ ముందుంటున్నారు. ఎవరైనా అభాగ్యులు, ఆపదలో ఉన్న వారు కనిపిస్తే చలించిపోతారు. మతిస్థిమితం కోల్పోయిన వారిని చేరదీసి వారి ఆకలిని తీరుస్తున్నారు. ఆశ్రమాల్లో చేర్పిస్తారు. మహిళలను సఖి కేంద్రానికి తరలిస్తున్నారు. ఇప్పటివరకు 8 మందిని ఆదుకున్నారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

అన్నింటా తీర్చిదిద్ది..



విద్యార్థులతో శ్రీనివాస్‌రావు

విద్యార్థుల భవితకు మార్గం చూపాల్సిన గురుతర బాధ్యత గురువులదే. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరువద్దు.

జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం జడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా 8 ఏళ్లకు పైగా విధులు నిర్వర్తించిన అడ్డాడ శ్రీనివాస్‌రావు.. తెలుగు ఉపాధ్యాయుడైన ఈయన విద్యార్థులు వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటేలా చేశారు. ప్రత్యేక చొరవ చూపి 150 మంది బాలకవులు, 200 మంది పుస్తక సమీక్షల్లో, మరో 100 మంది కథలు రాసే ప్రతిభావంతులుగా రూపుదిద్దడంలో కీలకంగా వ్యవహరించారు. సెలవులను సైతం ఇందుకే కేటాయించేవారు. ఇటీవల ఎద్దుమైలారం జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు.

– న్యూస్‌టుడే, జిన్నారం

సైన్స్‌లో ఇప్పటికీ వెనకబడి ఉన్నాం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని పలు చిన్నదేశాలు విభిన్న అంశాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని, 140 కోట్లకుపైగా జనాభా ఉన్న అతి పెద్ద దేశం భారత్ ఈ విషయంలో ఇంకా వెనకబడి ఉందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. చిప్స్ తయారీలో ముందున్న తైవాన్‌పై బలమైన దేశాలు ఆధారపడుతున్నాయని.. ఈ తరహాలో భారత్ సైతం కొన్ని అంశాల్లో ఆధిపత్యానికి ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ మంత్రి మాజీ శాస్త్రీయ సలహాదారు, డీఆర్డీవో మాజీ డైరెక్టర్ జనరల్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదటి తెలుగు ఉపకులపతి డాక్టర్ సూరి భగవంతం జయంతి వేడుకలు గురువారం ఓయూలోని దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో జరిగాయి. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు. మనదేశం రక్షణ రంగంలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా స్వయం సమృద్ధి సాధించడం వెనక డీఆర్డీవో డీజీగా డాక్టర్ సూరి భగవంతం వేసిన పునాదే కారణమని డీఆర్డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి కొనియాడారు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ దూరం లక్ష్యాన్ని గురిపెట్టే గన్ భారత్‌లో మాత్రమే ఉందని.. ఈ దశకు చేరుకోవడంలో సూరి కృషి ఉందన్నారు.



ఐఐటీహెచ్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తికి అవార్డు అందజేస్తున్న ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ సతీష్‌రెడ్డి చిత్రంలో డాక్టర్ భుజంగరావు, ఎస్.బి.రామ్, లక్ష్మీనారాయణ

ఐదుగురికి ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాక్టర్ సూరి భగవంతం ఎక్స్‌లెన్స్ అవార్డులను ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్. మూర్తి, ఇస్రో-ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్, ఇంటిలిజెంట్ డిజైన్ ఏఐ సీఈవో, సీటీవో రవి నిమ్మగడ్డకు ప్రదానం చేశారు. డీఆర్‌డీవో మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డీజీ యు.రాజబాబు స్థానంలో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఎ.ఎస్.మూర్తికి, రవి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ మొచ్చెర్ల శశిభూషణ్ స్థానంలో శరత్‌కు అవార్డులను బహూకరించారు. ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో మాజీ డీజీ వి.భుజంగరావు, డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్.బి.రామ్ తదితరులు మాట్లాడారు.

వేదన.. రోదన

- శోకసంద్రంగా మారిన తూప్రాన్ ఆసుపత్రి ఆవరణ
- మృతదేహాల కోసం వచ్చిన బాధితులు

తూప్రాన్, శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం ఉసిరికపల్లి శివారులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతిచెందిన విషయం విదితమే. గురువారం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో కట్టుదిట్టమైన పోలీసుల భద్రత మధ్య శవ పంచనామా నిర్వహించారు. ఈ సమయంలో బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి. ఈ క్రమంలోనే కొంతమంది సొమ్మసిల్లి కింద పడిపోయారు. మృతదేహాలను చూసేందుకు బంధువులు భారీగా తరలివచ్చారు. డీఎస్పీ వెంకటరెడ్డి, ఆస్పత్రి పర్యవేక్షకులు అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల సమయంలో శవ పంచనామా ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఏడు మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. మృతదేహాలను ట్రాక్టర్‌లో ఎక్కించే సమయంలో మృతురాలు అనిత భర్త మోహన్ బంధువులు ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నామ్‌సింగ్‌ను తీసుకొచ్చే వరకు మృతదేహాలను తీసుకెళ్లమని నిరసన తెలిపారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



విషణ్ణవదనాలతో బాధిత కుటుంబ సభ్యులు



పోలీసు పహారాలో అంత్యక్రియలు

శివ్వంపేట మండలంలోని మూడు తండాల్లో పోలీసు భద్రత మధ్య రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు జరిగాయి. భీమ్లా తండాలో గూగులోత్ శాంతి, ఆమె కూతురు మమత (10వ తరగతి), జగ్య తండాలో మాలోత్ అనిత, ఆమె కుమార్తెలు హిందు(8వ), శ్రావణి (5వ), తాళ్లపల్లి తండాలో ధనావత్ శివరాం, దుర్గి అంత్యక్రియలు చేపట్టారు. మూడు కుటుంబాల వారు రక్తసంబంధీకులు కావడంతో ఎక్కడి వారు అక్కడే అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సంఘటనకు కారకుడైన భీమ్లా తండాకు చెందిన కారు డ్రైవర్ గుగులోత్ నామ్‌సింగ్‌ను అప్పగించాలని ఆగ్రహించిన అనిత బంధువులు ఆయన కుమారుడు రాజేశ్‌పై చేయి చేసుకున్నారు. భీమ్లా తండా, జగ్య తండాలో బాధిత కుటుంబాలను శివ్వంపేట సహకార సంఘం ఛైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి పరామర్శించారు. మృతదేహాలకు నివాళి అర్పించారు. రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. శివ్వంపేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు మహేష్ గుప్తా బాధిత కుటుంబాలను తూప్రాన్ ఆసుపత్రిలో బుధవారం రాత్రి పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.



జగ్యా తండాలో ఆవేదనలో అనిత భర్త మోహన్

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



అంజయ్య

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలతో ఓ రైతు పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెల్పుల అంజయ్య (51)కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పిల్లలందరికీ వివాహాలు అయ్యాయి. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు, తరచుగా కుటుంబ కలహాలు చోటుచేసుకుంటుండటంతో అంజయ్య పోతారెడ్డిపేటలో కౌలుకు తీసుకున్న పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య గంగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో వృద్ధుడు..

తూప్రాన్: వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తూప్రాన్‌లో గురువారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. పండ్ల వ్యాపారి ఉడుత నాగయ్య (75) తూప్రాన్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఓ ఇంట్లో భార్య లక్ష్మితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఇంట్లో నుంచి బయటకు వచ్చిన నాగయ్య పక్కనే ఉన్న రేకుల షెడ్డుల్లో ఉరేసుకున్నాడు. అర్ధరాత్రి లక్ష్మికి భర్త కనిపించకపోవడంతో బయటకు వెళ్లేందుకు యత్నించింది. గడియ పెట్టి ఉండటంతో పక్కింటి వారి సాయంతో బయటకు వచ్చి చూడగా నాగయ్య విగతజీవిగా కనిపించాడు. నాగయ్య మృతిపై అనుమానం ఉందని విచారణ చేపట్టాలని లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గిరిజన న్యాయ కళాశాల పిలుస్తోంది!

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

ఈనెల 19న తక్షణ ప్రవేశాలు

గిరి పుత్రులను న్యాయ విద్యలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట న్యాయ కళాశాలను ఏర్పాటుచేసింది. దేశంలో గిరిజన (పురుషుల) గురుకుల న్యాయ కళాశాల ఇదొక్కటే కావడం విశేషం. ప్రస్తుతం న్యాయ విద్య కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 19న తక్షణ ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఇక్కడ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం విశేషం.

ఐదేళ్ల కోర్సు..

ఇంటర్ అర్హతతో లాసెట్ రాసిన వారిలో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. రిజర్వేషన్లు సైతం వర్తింపజేస్తారు. ఇక్కడ సీటు సాధిస్తే ఐదేళ్లలో న్యాయ విద్య కోర్సు (బీఏ, ఎల్ఎల్‌బీ) పూర్తి చేయవచ్చు. 2020-21 విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతోంది. ఏటా 60 మందికి తొలి సంవత్సరంలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు. సరైన అవగాహన లేక ఎంతో మంది ఈ కళాశాలను ఎంచుకోకపోవడంతో సీట్లు మిగిలిపోతున్నాయి. గత విద్యా సంవత్సరం 34 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాలు షురూ అయిన నేపథ్యంలో ఆసక్తి ఉన్న వారు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.



గిరిజన గురుకుల న్యాయ కళాశాల

కళాశాలలో విద్యార్థులు


- ప్రథమ: 20
- ద్వితీయ: 26
- తృతీయ: 27
- నాలుగో: 37
- ఐదో: 31

మెరుగైన సదుపాయాలు

కళాశాలలో సీటు సాధిస్తే ఎలాంటి ఖర్చు లేకుండానే కోర్సు పూర్తి చేయవచ్చు. భోజన, వసతి సదుపాయాలు ఉంటాయి. నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 20 కంప్యూటర్లతో కూడిన ఈ-గ్రంథాలయం కూడా ఉండటం విశేషం. విద్యార్థుల ఆరోగ్యానికి బాటలు వేసేలా ఆధునిక వ్యాయామ శాల ఏర్పాటుచేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

నిరీక్షణరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపల్



సంగారెడ్డిలోని గిరిజన సంక్షేమ గురుకుల న్యాయ కళాశాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తొలి సంవత్సరంలో 60 సీట్లకు అత్యధికంగా 51 సీట్లు ఎస్టీలకే ఉంటాయి. మిగతా వాటిని రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తారు. ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాం. ప్రవేశాలు పొందిన వారిలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు హైకోర్టులో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ సమయంలో స్టైఫండ్ అందుతుంది.



మెదక్ చర్చిలో విదేశీయుల సందడి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్‌లోని సీఎస్ఐ చర్చిని గురువారం అమెరికాకు చెందిన 19 మంది సందర్శించారు. వారు ప్రార్థనా మందిరంలో ఆరాధన చేపట్టారు. చర్చిని సందర్శించి స్వీయ చిత్రాలు దిగుతూ సంతోషం వ్యక్తం చేశారు. పలువురు వారితో చిత్రాలు దిగి సందడి చేశారు. – న్యూస్‌టుడే, మెదక్ అర్బన్

పల్లె నుంచి సినీ దర్శకుడిగా..



సిద్దిపేట జిల్లా చేర్యాల పరిధి గుర్జకుంటకు చెందిన పుర్మ స్మరణ్‌రెడ్డి సినీ దర్శకుడిగా మారడం అక్కడి వారిలో సంతోషాన్ని నింపింది. అతడికి సినిమాలు అంటే ప్రాణం. అదే ఇష్టంతో అడుగేసి చిత్ర దర్శకుడిగా మారడం విశేషం. స్మరన్‌రెడ్డి తల్లిదండ్రులు అరుణ, రాంభూపాల్‌రెడ్డి. కుటుంబం చేర్యాలలో స్థిరపడగా, స్మరణ్‌రెడ్డి పది వరకు స్థానికంగా చదువుకున్నారు. ఇంటర్, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తిచేశారు. సినిమాలపై మక్కువతో ఇంజినీరింగ్ పూర్తవగానే ఈ రంగాన్ని ఎంచుకున్నారు. చిత్ర దర్శకురాలు నందినిరెడ్డి వద్ద సహాయకుడిగా పనిచేశారు. 2017లో 'ఎమోషన్' లఘుచిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ తర్వాత 'లవ్ రెడ్డి' సినిమా రూపొందించారు. 'ఆంధ్ర- కర్ణాటక' రాష్ట్రాల సరిహద్దులో యువ జంట ప్రేమే ఈ చిత్ర కథాంశం. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. వాస్తవ ఘటనల ఆధారంగా నా తొలి చిత్రాన్ని రూపొందించానని, మైత్రీ మూవీ మేకర్స్ వాళ్లు డిస్ట్రిబ్యూట్ చేయడం సంతోషంగా ఉందని స్మరణ్‌రెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, చేర్యాల

నీతో మేమూ వస్తాం..

- పక్కింటి యువకుడి బైకు ఎక్కిన విద్యార్థులు
- బస్సు ఢీకొని ముగ్గురూ దుర్మరణం

పూడూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడితో సహా యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరోయువకుడు ప్రాణాలు వదిలారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పూడూరు గేటు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గొంగుపల్లికి చెందిన ఎం.ప్రవీణ్(21) కూలీ. అతడికి భార్య అఖిల, ఏడాది కుమారుడు ఉన్నారు. మేడికొండలోని తన అమ్మమ్మ ఊరిలో శుభకార్యానికి రెండు రోజుల కిందట ఒంటరిగా వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన విద్యార్థులు వికారాబాద్ వైపు వెళ్లాల్సిన చిల్కమర్రి నవీన్‌కుమార్(20), బుడ్డమొళ్ల హర్షవర్ధన్(15) తమను మన్నెగూడలో దింపాలని అభ్యర్థించారు. దీంతో అతడు కాదనలేక ఇద్దరినీ తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. గ్రామం నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలోని హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి పైకి చేరుకున్నారు. సరిగ్గా పూడూరు గేటు వద్దకు ద్విచక్రవాహనం రాగానే.. హైదరాబాద్ నం-1 డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు నేడం వెళ్తుండగా.. ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నవీన్, హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. వాహనాన్ని నడిపే ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో స్థానికులు అతడిని పరిగి ఆస్పత్రికి తరలిస్తుండగా.. దారిలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి ఘటనా స్థలాల్ని సందర్శించి ప్రమాద కారణాల్ని సీఐ, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ అధికారులు బాధిత కుటుంబాలకు రూ.10 వేల చొప్పున సహాయం అందించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.



నవీన్‌కుమార్ హర్షవర్ధన్ ప్రవీణ్‌కుమార్

కళాశాలకు వెళ్తూ..

మేడికొండకు చెందిన చిల్కమర్రి యాదయ్య, అంజమ్మలకు ముగ్గురు కుమారులు. వారిది వ్యవసాయ కుటుంబం. చిన్నవాడు నవీన్‌కుమార్ వికారాబాద్‌లోని శ్రీ అనంతపద్మనాభ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఆర్మీ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. దసరా సెలవులు ముగిసిన దరిమిలా.. కళాశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రవీణ్ బైక్ లిఫ్ట్ అడిగాడు.

ఎస్సీ గురుకులానికి..

మేడికొండకు చెందిన బుడ్డమొళ్ల చిన్న నర్సింలు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. కూలీ పనులు చేసుకుంటున్నారు. పెద్ద కుమారుడు స్థానికంగా పదోతరగతి చదువుతుండగా.. చిన్నకుమారుడు హర్షవర్ధన్ వికారాబాద్ పట్టణ పరిధి అనంతగిరిపల్లి సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ముగియడంతో గురుకులానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఎక్కి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఇద్దరూ పక్కపక్క నివాసాల్లో ఉండడంతో స్థానికంగా విషాదం అలుముకొంది.

ఆధారం కోల్పోయిన కుటుంబం..

ప్రవీణ్‌కుమార్‌కు దోమ మండలం దాదాపూర్‌కు చెందిన అఖిలతో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఏడాది కుమారుడు ఉన్నారు. భార్య, కుమారుడు ఇద్దరూ.. దసరాకు పుట్టింటికి వెళ్లారు. దీంతో భర్త ఒక్కడే శుభకార్యానికి వెళ్లాల్సి వచ్చింది. అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తన ఆధారం కోల్పోయామని కన్నీరు మున్నీరైంది.

వాహనం ఢీకొని.. వివాహిత దుర్మరణం



వనిత

వర్గల్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వివాహిత మృతి చెందింది. ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన దేవేందర్ కుటుంబీకులతో హైదరాబాద్ దోమలగూడలో ఉంటూ పోటీపరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. పండగకు ఇంటికి వెళ్లిన తల్లి గోపన్నగారి వనిత(46) సహా దేవేందర్ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమం జరిగిన ప్రమాదంలో దేవేందర్ ఎగిరి రోడ్డు పక్కకు పడిపోయాడు. తల్లి వనిత రోడ్డుపై పడగా ఢీకొట్టిన వాహనం ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకుల నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు. వనితకు భర్త, ఇద్దరు కుమారులు దేవేందర్, చాణక్య ఉన్నారు.

కారు బోల్తాపడి వ్యాపారి..

కొండపాక గ్రామీణం (కుకునూరుపల్లి): కారు బోల్తాపడి ఓ వ్యాపారి మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ కాచిగూడలో కార్వ రాజేశ్(42) వ్యాపారం చేస్తున్నాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లి కారులో గురువారం తెల్లారుజామున తిరుగు ప్రయాణమయ్యాడు. రాజీవ్‌రహదారిలో కుకునూరుపల్లి వద్ద రోడ్డు పక్కన ఇనుప కడ్డీలకు తాకి అనంతరం మరో కారును ఢీకొని బోల్తాపడింది రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు కాల్వ బేణిగోపాల్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

సిద్దిపేట టౌన్: రాజీవ్‌రహదారిపై రంగీలా దాబా చౌరస్తా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని లింగారెడ్డిపల్లికి చెందిన తాళ్ల మల్లారెడ్డి (65)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. గురువారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. మల్లారెడ్డిని హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోదరుడు యాదిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

కళలకు జీవం పోయడం అభినందనీయం



రామలింగేశ్వరాలయంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొలుపుల మహేశ్

దుబ్బాక, న్యూస్‌టుడే: అంతరించి పోతున్న ఒగ్గు కళలకు తెలంగాణ ప్రభుత్వం జీవం పోసి, వెలికి తీయడం అభినందనీయమని ఒగ్గు కథల ప్రధాన శిక్షకులు కొలుపుల మహేశ్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీ మల్లికార్జున ఒగ్గుకళా సేవాసమితి వారి ఆధ్వర్యంలో గురువారం కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఒగ్గుకథ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ సహకారంతో ప్రారంభించిన ఈ శిక్షణ శిబిరంలో 40 మందికి 41 రోజులపాటు ఒగ్గు కథపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సహాయ శిక్షకులు గుట్టయ్య, దేవయ్య, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 120-00	డ్రెస్డ్	206-00
రిటైల్ 142-00	స్కిన్‌లెస్	234-00

జారిపడకుండా వెళితేనే పాఠశాలకు!



బురద మార్గంలో తండ్రితో కలిసి బైకుపై వెళ్తున్న విద్యార్థిని

ఇటీవల కురిసిన వర్షాలకు పల్లెల్లో దారులన్నీ బురదగా మారి అధ్వానంగా తయారయ్యాయి. జగదేవ్‌పూర్ మండలం 'బాలికల గురుకుల' పాఠశాలకు వెళ్లే దారి సైతం కాలు పెట్టలేని విధంగా మారింది. సెలవుల్లో ఇంటికి వెళ్లిన విద్యార్థినులు తిరిగి తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వచ్చే క్రమంలో బురదరోడ్డులో బ్యాగులు, పెట్టెలు, ఇతర సామగ్రితో ద్విచక్రవాహనాలు, కాలినడకన రావడానికి నానా అవస్థలు పడుతున్నారు. – న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం:

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: భాజపా



మాట్లాడుతున్న గంగాడి మోహన్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికి తీసుకెళ్లాలని భాజపా జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట గ్రామీణ మండలం రాఘవాపూర్‌లో గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం భారాస, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 20 మంది నాయకులు, కార్యకర్తలు భాజపాలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు సురేశ్, తిరుమలరెడ్డి, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, త్రిలోచన్‌రెడ్డి, నవీన్, తిరుపతి తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో హమాలీలు, వ్యాపారులతో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు నిర్వహించారు. ప్రధాని మోదీ అసాధ్యమైన పనులను సుసాధ్యం చేస్తున్నారన్నారు. పట్టణ భాజపా ఉపాధ్యక్షుడు గాదాసు రాంప్రసాద్, బీజేవైఎం పట్టణాధ్యక్షుడు పోలోజు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభం.. గ్రామస్థుల సంబురం



మిఠాయిలు పంచుకుంటున్న నాయకులు, ప్రజలు

చేర్యాల, న్యూస్‌టుడే: కడవేర్గు శివారులోని వాగుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో పలు గ్రామాల నాయకులు, ప్రజలు సంబురాలు జరుపుకొన్నారు. భారాస మండల కమిటీ ఆధ్వర్యంలో వాగు వద్ద గురువారం ప్రయాణికులు, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, మాజీ ఎంపీపీ కరుణాకర్ మాట్లాడుతూ.. వంతెన నిర్మాణానికి 2023 ఏప్రిల్ లోనే అప్పటి ప్రభుత్వం రూ.2.72 కోట్లు మంజూరు చేసిందని, ఎన్నికల కారణంగా గుత్తేదారు పనులు చేపట్టలేదని తెలిపారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వమే మంజూరు చేసిందని కొందరు నాయకులు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కడవేర్గు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపురి, శభాష్‌గూడెం గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పురాధ్యక్షురాలు రజిత, తదితరులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక కార్యాలయ ఆవరణలో వాల్మీకి చిత్రపటానికి పురాధ్యక్షురాలు రజిత పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలన్నారు. కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, ఉపాధ్యక్షురాలు అనిత, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల: స్థానిక బల్దియా కార్యాలయంలో పురాధ్యక్షురాలు స్వరూపారాణి తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యక్షుడు నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు, వార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' పైపులైన్‌కు మరమ్మతు

కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: గత నాలుగు రోజులుగా నీరు లీకవుతున్న మిషన్ భగీరథ పైపులైన్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. కోహెడ మండలంలోని తంగళ్లపల్లి నుంచి గుండారెడ్డిపల్లి వెళ్లే మార్గంలో నీరు లీకవుతున్న విషయాన్ని గురువారం 'నీటి వృథా.. తప్పని వ్యథ' పేరిట 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అదే రోజున ఎంపీడీవో కృష్ణయ్యతో పాటు మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. జేసీబీతో గుంతలు తీసి పైపు నుంచి నీరు కారకుండా మరమ్మతులు చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఒప్పంద ప్రతిపాదికన ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌ఉమెన్ పోస్టు భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దుబ్బాక కస్తూర్బా బాలికల పాఠశాల ప్రత్యేకాధికారిణి టి.స్వాతి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

గోపుర కలశం అందజేత

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్ మండలం పందిల్లలోని ఆంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన అలుమల్ల చంద్రకళ, వీరారెడ్డి దంపతులు గోపుర కలశం బహూకరించారు. వారి కుమారుడు జగన్ రెడ్డి స్మారకార్థం అందజేసినట్లు తెలిపారు. దానిని ఆలయ గోపురంపై అలంకరించినట్లు మాజీ సర్పంచి తోడేటి రమేశ్ తెలిపారు.

దాడులు చేస్తూ.. దడ పుట్టిస్తూ

శునకాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం, చిన్నకోడూరు, బెజ్జంకి: పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా శునకాల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. ఇళ్లు, వీధులు, కూడళ్లలో సంచరిస్తూ చిన్నారులు, మహిళలు, వృద్ధులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రహదారులపై వెళుతున్న వాహనదారులకు అడ్డుగా వస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇళ్లల్లో వండిన పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్తున్న చిన్నారులను వెంటపడి దాడులు చేస్తున్నాయి. శునకాల దాడులతో ప్రజలు పడుతున్న అవస్థలపై 'న్యూస్‌టుడే' కథనం..



బెజ్జంకిలోని అంబేడ్కర్ కూడలిలో ప్రయాణికులను చుట్టుముట్టిన కుక్కలు

నెలలో వందమందిపై దాడి

- కోహెడ మండలంలోని పలు గ్రామాల్లో నెల రోజుల వ్యవధిలో శునకాల దాడిలో 21 మంది గాయపడినట్లు వైద్యాధికారిణి నిర్మా తెలిపారు.
- చిన్నకోడూరు పీహెచ్‌సీ పరిధిలో రెండు నెలల రోజుల వ్యవధిలో 38 మందిని, ఇబ్రహీంనగర్ పీహెచ్‌సీ పరిధిలో 42 మందిని శునకాలు కరిచాయని వైద్యులు ప్రియాంక, విజయకృష్ణ తెలిపారు.
- గొట్లమిట్ట గ్రామంలో ఇటీవల ఇంటి నుంచి బయటకు వెళ్లిన చిన్నారిపై శునకాలు దాడిచేసి చెంపను గాయపరిచాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందించారు.
- బెజ్జంకిలో కాలినడకన వెళ్లేవారితో పాటు, వాహనాల రాకపోకలకు అడ్డు వస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శునకాల నియంత్రణకు అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య లేకుండా చూస్తాం

– కృష్ణయ్య, ఎంపీడీవో, కోహెడ

పల్లెల్లో శునకాల బెడద ఉన్న విషయం వాస్తవమే. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. శునకాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు: ఎమ్మెల్యే



దీపాయంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్త ప్రభాకర్ రెడ్డి, తదితరులు

దౌల్తాబాద్, న్యూస్‌టుడే: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో రైతుల ఖాతాలో డబ్బు జమయ్యేలా చూడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండల పరిధిలోని దీపాయంపల్లి, శేరిపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని తిర్మలాపూర్‌కు చెందిన భారాస కార్యకర్త కిష్టయ్య ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబానికి పార్టీ అందించిన ప్రమాద బీమా రూ.రెండు లక్షల చెక్కును అందించారు. అనంతరం దీపాయంపల్లిలో నిర్వహిస్తున్న పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్ వెంకట్ రెడ్డి, కో-ఆపరేటివ్ సొసైటీ సీఈవో మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి

తొగుట, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో కాన్గల్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పెద్దమాసాన్‌పల్లి పాఠశాలలో భారాస నాయకుడు పన్యాల ప్రవీణ్ రెడ్డి సహకారంతో విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. అలాగే కాన్గల్‌లో వైకుంఠరథం, ఫ్రీజర్‌ను ప్రారంభించారు.

- గుడికందులలో విద్యుత్తు ప్రమాదంలో మరణించిన రైతు గోరేటి గురువారెడ్డి కుటుంబాన్ని ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. ముందే జాగ్రత్తపడి స్తంభాలు వేస్తే గురువారెడ్డి ప్రాణాలు దక్కేవని విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి పరిహారం అందేలా చూడాలని ఎస్ఈ చంద్రమోహన్‌ను ఫోన్‌లో ఆదేశించారు. కాన్గల్‌లో ఇటీవల మరణించిన ముడికె యాదయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

'అలయ్ బలయ్' విజయవంతం చేయాలి: భారాస

బెజ్జంకి: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారాస మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం బెజ్జంకిలో పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని తెలిపారు. లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్తా, తదితరులున్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న భారాస: నర్సారెడ్డి

గజ్వేల్, న్యూస్‌టుడే: అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకు భారాస నేతలు పేదలను అడ్డుపెట్టుకుని రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్, తాండ గ్రామాలకు చెందిన పలువురు భారాస నాయకులు, కార్యకర్తలు గురువారం ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. మూసీ సుందరీకరణతోపాటు సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని అడ్డుకునేందుకు పేద ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, ఏఎంసీ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

చేర్యాల(ధూల్మిట్ట): ధూల్మిట్ట మండలం కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి మలుగ గణేశ్ రూ.10వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డికి నగదును అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్‌పర్సన్ లక్ష్మీ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల పునర్విభజనకు వినతి

గజ్వేల్, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని 16, 17 వార్డులను పునర్విభజన చేయాలని వార్డుకు చెందిన యువకులు వినత్, రాజు, రమేశ్ తదితరులు గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికలకు ముందు 8వ వార్డులో భాగంగా ఉన్న శివాలయం వీధిని 16వార్డులో కొంత భాగం, 17వార్డులో కొంత భాగం కేటాయించారన్నారు. దీంతో తమ కాలనీలో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా తమ కాలనీని ఒకే వార్డు కిందకు తీసుకురావాలన్నారు.

బకాయిలు వెంటనే విడుదల చేయండి: ఏఐఎస్ఎఫ్

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుము, ఉపకార వేతనాలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నరేశ్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలో సంఘ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కళాశాలలకు బకాయిలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలను మూసివేసి నిరవధిక బంద్ చేస్తున్నందున విద్యార్థులకు నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రసన్నకుమార్, నవీన్, గణేశ్, సురేశ్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించరూ!

జగదేవపూర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, ప్రభుత్వం వెంటనే డీఏ బకాయిలను విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాలను ఆయన సందర్శించారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, పోచయ్య, జిల్లా నాయకులు శంకర్, తులసీదాస్ పాల్గొన్నారు.

రాయపోల్: మండల పరిధిలోని పాఠశాలల్లో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సుంచు నరేందర్, మండల శాఖ అధ్యక్షుడు గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: మండలంలోని పెద్దగుండవెల్లి, దుంపలపల్లి, రాజక్కపేట, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను టీపీటీఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్ జానకిరాములు, జిల్లా ఉపాధ్యక్షులు అమ్మన నర్సింహారెడ్డి, తదితరులున్నారు.

మిరుదొడ్డి: ఎస్టీయూ సభ్యత్వ నమోదులో భాగంగా మిరుదొడ్డి మండలం కాసులాబాద్, మిరుదొడ్డి తదితర ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఎస్టీయూ మండలాధ్యక్షులు సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మర్పడ్గ క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు



విజయదుర్గా మాత

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపాక మండలం మర్పడ్గలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో గురువారం శరత్ పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. క్షేత్రంలో ఉదయం గణపతి పూజ, దుర్గామాతకు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. సంతాన మల్లికార్జునుడికి అభిషేకం చేశారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు ఉన్నారు.

బకాయి డీఏలను విడుదల చేయాలి: టీఎన్జీవో

సిద్దిపేట, న్యూస్‌టుడే: ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ నాలుగు డీఏలను వెంటనే ప్రకటించి విడుదల చేయాలని, గుర్తింపు పొందిన సంఘాలతో సంయుక్తంగా స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి విక్రంరెడ్డి కోరారు. సిద్దిపేటలో గురువారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. డిజిటల్ పంటల సర్వేలో ఏఈవోలకు సహాయకులను నియమించాలన్నారు. సంఘం జిల్లా సహ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ప్రతినిధులు అశ్వాక్‌అహ్మద్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఒత్తిడి లేని విద్యా విధానం అవసరం: డీఐఈవో

సిద్దిపేట, న్యూస్‌టుడే: కార్పొరేట్ విద్యా విధానంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. లయన్స్ క్లబ్, జిల్లా ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మానసిక ఆరోగ్యం' అంశంపై జిల్లాలోని జూనియర్ కళాశాలల స్టూడెంట్ కౌన్సెలర్లకు గురువారం కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిడికి తావులేకుండా విద్యా విధానం కొనసాగాలన్నారు. డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.అయోధ్యరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హరిబాబు, తదితరులు ఉన్నారు.

పోలీసులకు వైద్య పరీక్షలు

సిద్దిపేట, న్యూస్‌టుడే: వార్షిక ఆరోగ్య పరీక్షల్లో భాగంగా జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి రక్త పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ఎక్కడికక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రెండు రోజుల వ్యవధిలో 296 మంది రక్త నమూనాలు అందించారు. పోలీసు అధికారులు, సిబ్బంది అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషనర్ అనూరాధ సూచించారు.

డ్రోన్ సాయం.. పిచికారీ సులభం



ఒకప్పుడు పంటలకు పురుగుమందులు పిచికారీ చేయాలంటే ఎంతో ఇబ్బందిగా ఉండేది. కూలీలు దొరక్కపోవడం, పురుగుమందుల వాసనతో అన్నదాతలు అవస్థలు పడేవారు. నూతన సాంకేతికత అందుబాటులోకి రావడంతో సాగుపనులు రోజురోజుకు సులభంగా మారుతున్నాయి. ముఖ్యంగా పంటలపై పురుగుమందుల పిచికారీకి డ్రోన్లు అందుబాటులోకి రావడంతో వాటి వాడకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. పురుగుమందు కంపెనీలు, దుకాణ యజమానులు అవసరమైన డ్రోన్లు సమకూర్చుతున్నారు. ఎకరం విస్తీర్ణాన్ని కేవలం 7 నుంచి 10 నిమిషాల్లో పిచికారి చేస్తూ రూ.400 తీసుకుంటున్నారు. బెజ్జంకి శివారులోని పత్తి పంటలో ఓ రైతు డ్రోన్ ద్వారా రసాయనాలు పిచికారీ చేస్తుండగా కనిపించిన దృశ్యమిది. – న్యూస్‌టుడే, బెజ్జంకి

దళారులను నమ్మి మోసపోవద్దు

దుబ్బాక: దళారులను నమ్మి మోసపోవద్దని పురాధ్యక్షురాలు గన్నె వనిత అన్నారు. గురువారం దుబ్బాకలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ శేర్ల కైలాశ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నాయకులు అనవసర విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. ఏఎంసీ కార్యదర్శి సురేశ్, పీఏసీఎస్ డైరెక్టర్లు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అంతకుముందు ఇదే విపణిలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ కాల్వ నరేశ్, పీఏసీఎస్ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

చేర్యాల: ఐకేపీ ఆధ్వర్యంలో సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకునూరులో ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎం ప్రకాశం తెలిపారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: మద్దూరు మండలం మర్మాముల శివారులోని జూద స్థావరంపై పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. గ్రామానికి చెందిన ఓ రైతు ఫామ్‌హౌజ్‌లో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారంతో ఆకస్మికంగా దాడి చేసినట్లు మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. నలుగురు జూదరులపై కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.15వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సిద్దిపేట టౌన్ 9963585053, జగదేవపూర్ 8008573209, హుస్నాబాద్ 8008573520, దుబ్బాక 9030037175, చేర్యాల 8008574871, గజ్వేల్ 9490675047 (10AM TO 1 PM)

న్యూస్‌టుడే, చిన్నకోడూరు, దుబ్బాక:

? రామునిపట్ల బీసీ కాలనీలో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిండి నీరంతా వృథాగా పోతుంది. – మల్లేశం, రామునిపట్ల

✓ గ్రామపంచాయతీ కార్యదర్శికి సూచించి సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం – జనార్దన్, ఎంపీడీవో, చిన్నకోడూరు

? చిన్నకోడూరులో విద్యుత్తు దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలి – నాగరాజు, చిన్నకోడూరు

✓ గతంలోనే ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేశాం. సిబ్బందికి మరోసారి సూచించి సమస్య పరిష్కరిస్తాం – రమేశ్, విద్యుత్తుశాఖ ఏఈ, చిన్నకోడూరు

? దుబ్బాక పట్టణంలోని రెండు పడక గదుల గృహ సముదాయం వద్ద రహదారి పక్కనే చెత్తను వేస్తుండడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. – గణేశ్, దుబ్బాక

✓ చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. వీలైతే అక్కడ తడి, పొడి చెత్త డబ్బాలు ఏర్పాటు చేస్తాం. – రమేశ్ కుమార్, పుర కమిషనర్

? పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. వాటిని వినియోగంలోకి తీసుకొస్తే, యువతకు ఉపయోగపడతాయి – సతీశ్ కుమార్, హబ్షీపూర్

✓ క్రీడా ప్రాంగణాల్లో మరమ్మతులు చేపట్టి, వినియోగంలోకి తీసుకొస్తాం. – వేలేటి భాస్కర శర్మ, దుబ్బాక ఎంపీడీవో

పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని ఆందోళన



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న రైతులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: తమ గ్రామంలో పీఏసీఎస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామానికి చెందిన పలువురు రైతులు సిద్దిపేట కలెక్టరేట్ ముందు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఉన్నప్పటికీ నిర్వాహకులు సరిగా నిర్వహించటం లేదని వాపోయారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

కుంట శిఖం ఆక్రమణపై ఫిర్యాదు

బెజ్జంకి: మండలంలోని తోటపల్లి గ్రామ శివారులోని జంగం మల్లయ్య కుంట శిఖం భూమి ఆక్రమణకు గురైందని, విచారణ జరపాలని కోరుతూ గురువారం తహసీల్దారుకు ఫిర్యాదు చేసినట్లు ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం మండల ఉపాధ్యక్షుడు మాశం బాబు తెలిపారు. సర్వే నంబర్ 121లో 21.14 ఎకరాల శిఖం భూమి ఉండగా, సుమారు రెండు ఎకరాలు ఆక్రమించుకొని కొందరు ఫామ్‌ల్యాండ్ డెవలపర్స్ పేరిట వెంచర్ ఏర్పాటు చేశారని తెలిపారు. శిఖం అన్యాక్రాంతంపై విచారించి కారకులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. శ్రీనివాస్, రంజిత్, శంకర్, తదితరులు ఉన్నారు.

యువకుడి మృతిపై ఏసీపీ విచారణ

చేర్యాల(ధూల్మిట్ట), న్యూస్‌టుడే: ధూల్మిట్ట మండలం బెక్కల్ గ్రామానికి చెందిన బైరగోని యాదగిరి అనుమానాస్పద మృతిపై హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ విచారణ చేపట్టారు. ఈ మేరకు గురువారం ఆయన చేర్యాల సీఐ ఎల్.శ్రీనుతో కలిసి కూటిగల్ శివారులో యాదగిరి చనిపోయిన ప్రాంతాన్ని సందర్శించారు. చివరిసారిగా మృతుడిని చూసిన వారితోనూ, బెక్కల్, బైరాన్‌పల్లి, కూటిగల్ గ్రామస్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ములుగు, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపారు. గురువారం వాహనాల తనిఖీలో భాగంగా మండల పరిధిలోని చేబర్తికి వెళ్లగా.. అక్కడ అనుమానాస్పదంగా ఓ టాటా ఏస్ వాహనం వెళ్లటం గమనించామన్నారు. దాన్ని వెంబడించి పట్టుకొని పరిశీలించగా అందులో 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ మేరకు బియ్యాన్ని తరలిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడానికి చెందిన ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పైపులైన్ ధ్వంసం.. ఇద్దరిపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం జనగామకు చెందిన బెక్కంటి సంపత్‌కు చెందిన వ్యవసాయ బావి మోటారుకు సంబంధించిన స్టార్టర్ ఫ్యూజ్‌వైర్లు తొలగించడంతో పాటు, పైపులైన్ ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు. కొంత కాలంగా సంపత్‌కు అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు మధ్య భూవివాదం నడుస్తోంది. దీనిని మనసులో ఉంచుకుని వారిద్దరూ ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తూ వారిపై సంపత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి రూ.2 లక్షల సాయం



నగదు పత్రాలను అందజేస్తున్న 108 అధికారులు, సిబ్బంది

దుబ్బాక: కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం కంచర్ల గ్రామానికి చెందిన కైరంకొండ లింగం దుబ్బాక 108 సర్వీస్‌లో వాహన డ్రైవర్‌గా పని చేస్తూ అనారోగ్యంతో రెండు నెలల క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని 108, 102 ఉద్యోగ మిత్రులందరూ కలిసి తలా కొంత నగదు ఇవ్వడంతో రూ.2,09,535 పోగయ్యాయి. బాధిత కుటుంబానికి గురువారం దుబ్బాక వంద పడకల ఆసుపత్రిలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్దన్, సిద్దిపేట జిల్లా ఎగ్జిక్యూటివ్ మేనేజర్ అఫ్రోజ్, రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాలాజీ నాయక్ చేతుల మీదుగా నగదును అందజేశారు. కార్యక్రమంలో 108 సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రవీందర్, దుబ్బాక అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.